క్లుప్తంగా

పరామర్శ



అచేతన స్థితిలో ఉన్న రమణను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేత రాజేష్

రాజాం సిటీ: రోడ్డు ప్రమాదానికి గురై, మంచానికే పరిమితమైన మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన ఇనుమల రమణను వైఎస్సార్ సీపీ నేత, వైద్యుడు తలే రాజేష్ శుక్రవారం కలిసి, పరామర్శించారు. ఆయన అనారోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, తనవంతు సాయంగా ట్రై సైకిల్ అందజేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు శాసపు వేణుగోపాల్, సత్తిరాజు తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజును అభినందిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక మున్సిపల్ ఎఫ్ఏసీ కమిషనర్‌గా మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి పనిచేసిన కమిషనర్ డీటీవీ కృష్ణారావు ఇటీవల సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ప్రస్తుతం ఎఫ్ఏసీగా నియమితులైన నాగరాజు ఆ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో అత్యవసర పనుల పూర్తిపై దృష్టిసారించనున్నామన్నారు.

ఎస్ఐ సురేంద్రనాయుడుకు అవార్డు



ఎస్పీ దీపికాపాటిల్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: ఎస్ఐ సురేంద్రనాయుడుకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. మండలంలోని కేసులను త్వరితగతిన పరిష్కరించడం, శాంతిభద్రతల పరిరక్షణకు ఆయన చేసిన కృషికి గాను విజయనగరంలో ఎస్పీ దీపికాపాటిల్ చేతులమీదుగా ఆయన ఈ అవార్డును శుక్రవారం అందుకున్నారు. ఈ మేరకు ఆయనను ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి తదితరులు అభినందించారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు



లింగాలవలస వద్ద కొత్తగా వేసిన రోడ్డు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట నుంచి రాజాం జీఎంఆర్ ఐటీ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.9 కోట్ల అంచనా వ్యయంతో ఆర్అండ్‌బీ శాఖ ఈ పనులు చేపడుతోంది. ఇటీవల ఈ రోడ్డు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కంబాల జోగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పనులు మరింత వేగవంతమయ్యాయి.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

బొబ్బిలి: పట్టణంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. పలువురు కార్మికులు సమ్మె చేస్తుండగా, 40 మంది శాశ్వత కార్మికులతో పనులు చేయిస్తున్నామని ఆయన అన్నారు. కార్మికులు అందుబాటులో లేరని, ప్రజలు కూడా సహకరించి, పారిశుద్ధ్య కార్మికులకు చెత్తను అందించాలని కోరారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు

బొబ్బిలి: అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థి నుంచి రూ.810 ఫీజు మాత్రమే తీసుకోవాలని నిర్ణయించిందని, అయితే కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు రూ.2 వేల నుంచి 3 వేల వరకు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థికభారం కలిగేలా చేస్తున్నారన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



రాజాం: బొద్దాంలో కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం క్రీడాపోటీలు నిర్వహిస్తోంది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో శుక్రవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు క్రీడాకారులను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించారు. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలతోనే శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా ముందుకు కొనసాగాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: సుందరాడలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



రామభద్రపురం: సోంపురంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



బాడంగి: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల మైదానంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



రేగిడి: తోకలవలసలో క్రికెట్ పోటీలకు సన్నద్ధమైన క్రీడాకారులు



రామభద్రపురం: తారాపురంలో జరుగుతున్న ఖోఖో పోటీ



వంగర: మండల కేంద్రంలో ఖోఖో పోటీల్లో పాల్గొన్న మహిళలు



బాడంగి: గురుకుల పాఠశాల క్రీడామైదానంలో వాలీబాల్ ఆటలో తలపడుతున్న ఇరుజట్లు



బొబ్బిలి: అలజంగిలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులు



బొబ్బిలి: అలజంగిలో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న దృశ్యం

జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2ను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

తెర్లాం: మండలంలో జనవరి నెలలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా ప్రభుత్వం జనవరి నుంచి పెంచిన రూ.3 వేలు పెన్షన్‌తో పాటు, కొత్తగా మంజూరైన పెన్షన్ల పంపిణీ పక్కాగా నిర్వహించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2కి సంబంధించిన ఏర్పాట్లతో పాటు, ఈ కార్యక్రమంపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా చేపట్టిన ధాన్యం కొనుగోలును పంచాయతీ కార్యదర్శులంతా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మండలంలో జరుగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

‘ఉపాధి’ పనుల నిర్వహణపై శిక్షణ

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై మేట్‌లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాసూరి శంకరరావు మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలని, టెక్నికల్ అసిస్టెంట్లు నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు జరిగేలా చూడాలన్నారు. మస్టర్లు పక్కాగా వేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక ఉపాధి కార్యాలయంలో బాడంగి, పాల్తేరు క్లస్టర్ల పరిధిలోని ఉపాధి హామీ పథకం మేట్‌లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఉపాధి పనుల నిర్వహణపై మేట్‌లకు పలు సూచనలు చేశారు. ఏ విధంగా పనులు చేయిస్తే వేతనదారులకు గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందో తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: ఉపాధి హామీ పథకం మేట్‌లకు సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామకృష్ణ

చురుగ్గా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



తెర్లాం బీసీ కాలనీలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు పంపిణీ చేస్తున్న ఏఎన్ఎం ప్రభావతి

తెర్లాం: మండలంలోని తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన కొత్తకార్డుల పంపిణీ కార్యక్రమం చాలా చురుగ్గా జరుగుతోంది. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ వలంటీర్లు కలిసి, ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం వారు వైద్య సిబ్బందిని ఉద్దేశించి, మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని మరింత వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారుల స్మార్ట్‌ఫోన్‌లో ఆరోగ్యశ్రీ యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేయించాలన్నారు. గతంలో ఆరోగ్యశ్రీ పథకానికి ఉన్న రూ.5 లక్షల పరిమితిని సీఎం జగన్మోహన్‌రెడ్డి రూ.25 లక్షలకు పెంచినట్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

పండ్లతోటల పెంపకంపై అవగాహన

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో బీడు భూముల్లో పండ్లతోటల పెంపకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏ నేల పండ్లతోటల పెంపకానికి అనుకూలం, పెంపకంలో ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాలను తెలిపారు. అనంతరం మొక్కలు పెంచే విధానం, దుక్కి పనులు, విత్తనశుద్ధి అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఉంగరాడ యూనిట్ ఐసీఆర్‌పీలు రవి, లక్ష్మణనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పండ్లతోటల పెంపకానికి విత్తనాలు నాటే విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలిలో శివపార్వతుల కల్యాణోత్సవం అంగరంగవైభవంగా శుక్రవారం నిర్వహించారు. దేశమ్మతల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామి వారి కల్యాణం కనులారా తిలకించారు.

31న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 31వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ‘మున్నీటి మత్స్యకార జీవనం’ అనే అంశంపై పొదిలాపు శ్రీనివాసరావు ప్రసంగించనున్నారని తెలిపారు. కార్యక్రమానికి కవులు, రచయితలు, భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

గ్రామసభ

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామసచివాలయం వద్ద శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీలంతా ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, జరిగిన సోషల్ ఆడిట్ వివరాలను వెల్లడించారు. గ్రామంలో రూ.90 లక్షలతో పనులు చేపట్టారని తెలిపి, గ్రామస్తులు, అధికారుల నుంచి అభ్యంతరాలు సేకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ బండి బోడమ్మ, ఎస్ఆర్‌పీ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మిల్లులకు ధాన్యం తరలింపు



కొండలమామిడివలస రైస్‌మిల్లుకు ట్రాక్టర్లలో తరలిస్తున్న ధాన్యంబస్తాలు

రేగిడి: మండల వ్యాప్తంగా రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో రైతులకు గతంలో వారు ఎదుర్కొన్న ధాన్యం విక్రయ కష్టాలు తప్పాయి. ధాన్యం అమ్మిన రెండు, మూడు రోజుల్లోనే నగదు కూడా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ‘సాగి’ ధ్యేయం

• డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి



తలగాంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి

వంగర: గ్రామాల అభివృద్ధే సంసద్ ఆదర్శ గ్రామ్ యోజన(సాగి) ధ్యేయమని డీఆర్‌డీఏ ఏపీడీ (అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్) కె.సావిత్రి అన్నారు. శుక్రవారం మండలంలోని తలగాం గ్రామ సచివాలయంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాన్ని ఓ సమూహంగా తీసుకుని, అన్నివిధాలా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సూచనల మేరకు జిల్లాలోని ఐదు గ్రామాలను ఈ మేరకు ఎంపిక చేసిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, అవసరమైన నిధులు, కుటీర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన, అన్నిరంగాల ప్రజల అభివృద్ధికి దోహదపడే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. వైస్ ఎంపీపీ మాట్లాడుతూ మా ప్రాంతంలో వ్యవసాయాధారిత గ్రామాలున్నాయని, జొన్నపొత్తల డ్రైయింగ్ యంత్రాలను మంజూరు చేస్తే రైతులకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి కోసం కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేపట్టి, ఆసక్తి కలిగిన రంగాల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మహిళా స్వయం శక్తి సంఘాలకు శిక్షణ అనంతరం పుట్టగొడుగుల తయారీ, అగరబత్తీల తయారీ, బిస్కెట్ల తయారీ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి, అభివృద్ధి చేయాలని తెలిపారు. గతంలో గ్రామాభివృద్ధికి ప్రతిపాదించిన రూ.20 లక్షలు పనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు, రాజాం వెలుగు కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్, ఏపీఎంలు మీసాల చక్రపాణి, తెర్లి మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

• డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి

వంగర: స్వయం శక్తి సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతమై, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ ఏపీడీ(అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్) కె.సావిత్రి ఆకాంక్షించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి ఆధ్వర్యంలో సీసీలు, వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. స్త్రీనిధి, సీఐఎఫ్, హెచ్‌డీఐఎఫ్‌ల ద్వారా పొందిన రుణాల రికవరీ శతశాతం చేపట్టాలన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈల ద్వారా ప్రతీ మండలంలో 500 మంది మహిళలకు రుణాలు మంజూరు చేసి, మహిళలను పారిశ్రామికవేత్తలను చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గ్రామైక్య సంఘాల్లో మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు వీవోలంతా మహిళల్లో చైతన్యం నింపాలన్నారు. స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీనిధి జీవనోపాధుల ద్వారా ఈ ఏడాది రుణ లక్ష్యం రూ.157 కోట్లు కాగా ఇప్పటివరకు రూ.130 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజాం వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ అలుగోలు చిరంజీవి, ఏపీఎంలు మీసాల చక్రపాణి, తెర్లి మంగమ్మ, స్త్రీనిధి మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

• వైద్యాధికారులు దిలీప్‌కుమార్, రత్నదీపక్



మాట్లాడుతున్న రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీల వైద్యాధికారులు దిలీప్‌కుమార్, రత్నదీపక్

రామభద్రపురం: పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీల వైద్యాధికారులు దిలీప్‌కుమార్, రత్నదీపక్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఈ నాలుగున్నరేళ్లలో 2,470 మంది పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.1.50 కోట్లు విలువైన వైద్యసేవలను ప్రభుత్వం అందించిందన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో ఆస్పత్రిలో చేరిన 13,560 మంది కోవిడ్ బాధితులకు రూ.1,33,40,000 నిధులను ప్రభుత్వం ఖర్చు చేసిందని పేర్కొన్నారు. వివిధ రకాల వ్యాధులకు ఆపరేషన్లు, చికిత్సలు అందించడమే లక్ష్యంగా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిందన్నారు. గతంలో తెల్లకార్డు ఉన్న వారికే ఆరోగ్యశ్రీ పథకం వర్తించేదని, ప్రస్తుతం రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న ప్రతీ ఒక్కరికీ ఆరోగ్యశ్రీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ దరఖాస్తుల పరిశీలన

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు, వారి అర్హతలను ఎంపీడీవో బాసూరి శంకరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించి, ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే లబ్ధిదారుల అర్హతలు పరిశీలిస్తున్నామన్నారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించామన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పొగిరిలో కొత్త పింఛన్ దరఖాస్తులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకరరావు

• క్యాలెండర్ ఆవిష్కరణ



బొబ్బిలి: క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్–2024ను మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసం, డి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండల పరిధిలోని మారుతీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో